



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 27-03-2024 సంపుటి : 06 సంచిక : 197 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఇక ప్రచార హోరు...



**ప్రజాగళం పేరుతో ప్రజల్లోకి చంద్రబాబు**
**మేమంతా సిద్ధం పేరుతో జగన్ బస్సు యాత్ర**

విజయవాడ, మార్చి 26,సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీల నేతల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వైసీపీ అధినేత సీఎం జగన్మోహన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం నుంచి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. సీఎం జగన్ మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్రకు సిద్ధమవుతుండగా, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరుతో ఎన్నికల పోరుకు సన్నద్ధమవుతున్నారు. ఇద్దరు నేతలు ఒకేరోజు ప్రజల్లోకి వెళుతుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ రెండు పార్టీలు రానున్న ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. విజయమే లక్ష్యంగా ఇరు పార్టీల అభ్యర్థులను ఖరారు చేశాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతుండగా, వైసీపీ మరోసారి ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే వైసీపీ సిద్ధం పేరుతో భారీగా బహిరంగ సభలను నిర్వహించింది. నాలుగు భారీ సభలు నిర్వహించిన తరువాత వైసీపీ కాస్త గ్యాప్ ఇచ్చింది. మళ్లీ బుధవారం నుంచి సీఎం జగన్ ప్రజల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇడుపులపాయలో బుధవారం ప్రారంభం కానున్న బస్సు యాత్ర 21 రోజులపాటు కొనసాగి ఇచ్ఛాపురంలో ముగియనుంది. సీఎం జగన్ బుధవారం ఉదయం 10.56 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి ఇడుపులపాయకు చేరుకుని రాజశేఖర్‌రెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేస్తారు. అనంతరం బస్సు యాత్రను ప్రారంభిస్తారు. తొలిరోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరగనుంది. ఇడుపులపాయ నుంచి వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి దువ్వూరు, చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర జరగనుంది. సిద్ధం సభలు జరిగిన నాలుగు పార్లమెంట్ నియోకజవర్గాలు మినహా మిగిలిన 21 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర సాగనుంది. సార్వత్రిక ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సిద్ధమవుతున్నారు. ప్రజాగళం పేరుతో సభలు, రోడ్ షోలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచే ఈ యాత్రకు చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 27 నుంచి 31 వరకు చంద్రబాబు వరుసగా పర్యటించనున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు నియోకజవర్గాల్లో ప్రజాగళం పేరుతో నిర్వహించనున్న యాత్రలో భాగంగా మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. 27న చంద్రబాబు పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని నిర్వహించనున్నారు. 28న రాప్తాడు, శింగనమలై, కదిరి, 29న శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు, 30న మైదుకూరు, ప్రొద్దుటూరు, నూళ్లూరుపేట, శ్రీకాళహస్తిలో ప్రచారాన్ని నిర్వహించనున్నారు. 31న కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో పర్యటించనున్నారు. సోమ, మంగళవారాల్లో ఆయన తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటిస్తారు. ఈ నెల 30వ తేదీ నుంచి పిఠాపురం నుంచి పవన్ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు.

# వాలంటీర్ల జీవితాలు మారుస్తా

**యువతకు సామాజిక బాధ్యత ఉండాలి**
**వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి, ఉద్యోగాల కొరత**
**జాబ్ కేలండర్ పేరుతో యువతను మోసం చేస్తున్న జగన్**
**టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు**



కుప్పం,మార్చి26(ఆర్ఎన్ఎ): కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు యువతతో భేటీ అయ్యారు. యువతకు సామాజిక బాధ్యత ఉండాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సీఎం వైఎస్ జగన్ యువతను మోసం చేశారని చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు మాత్రం డీఎస్సీ పేరుతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 ఉద్యోగాలను నచ్చినవారికి ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఏపీని కాపాడుకునేందుకు పొత్తులు పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. టీడీపీ, జనసేన , బీజేపీ అందుకే కలిశాయన్నారు. జెండాలు వేరైనా.. అజెండా మాత్రం ఒక్కటేనని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వైసీపీ నేతలు భూములు కొల్లగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. సర్వే నంబర్స్ మార్చి ప్రజల భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. సొంత నియోజకవర్గం కుప్పంలోనూ తనకు బెదిరింపులు తప్పటం లేదన్నారు. ఇక ఏపీలో సామాన్యుల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు. ఏపీలో ఖనిజ సంపదను వైసీపీ నేతలు దోపిడీ చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మండిపడ్డారు. ఇలా అడ్డదారుల్లో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో జే బ్రాండ్ మద్యాన్ని నిషేధిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. తన హయాంలో యువతకు ఐటీ ఉద్యోగాలతో కొత్తదారి చూపించానని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అక్రమార్కుల చేతుల్లో పడితే చాలా ప్రమాదకరమని చంద్రబాబు హెచ్చరించారు. పారదర్శకంగా జరగాల్సిన పాలనలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. టెండర్స్ లోనూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

# అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన వైఎస్సార్‌సీపీ

**అభ్యర్థుల జాబితాలో పెండింగ్ స్థానం భర్తీ**
**అన్ని పార్టీల కంటే ముందున్న వైఎస్సార్‌సిపి**
**175/175 అలాగే 25/25 అభ్యర్థుల ఖరారు**
**ముత్యాలనాయుడుకు ప్రమోషన్**
**మాడుగులలో ముత్యాల కూతురు**

గుంటూరు: అనకాపల్లి లోక్‌సభ స్థానానికి అభ్యర్థి పేరును వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని బరిలో నిలుపుతున్నట్లు పేర్కొంది. ఇప్పటికే 175 ఎమ్మెల్యే, 24 ఎంపీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించిన వైఎస్సార్‌సీపీ.. అనకాపల్లి ఎంపీ సీటు ఒక్కదానినే పెండింగ్‌లో ఉంచిన సంగతి తెలిసిందే.బూడి ముత్యాల నాయుడు కొప్పుల వెలమ సామాజిక వర్గం. ప్రస్తుతం మాడుగుల సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన్ని ఎంపీ అభ్యర్థిగా ప్రమోషన్ ఇచ్చారు సీఎం జగన్. దీంతో.. మాడుగుల స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లి అనురాధను ఎంపిక చేశారు. అనురాధ బూడి ముత్యాలనాయుడు కుమార్తె. మాడుగుల స్థానంలో పోటీ చేసిన బూడి ముత్యాలనాయుడు 16392 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఇక అనకాపల్లి పార్లమెంటు స్థానంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి ఘనవిజయం సాధించింది. పార్టీ అభ్యర్థి బీశెట్టి వెంకట సత్యవతి 89,192 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

# గెలుపే లక్ష్యంగా వ్యూహాలు..

**పిఠాపురం నుంచే పవన్ ఎన్నికల ప్రచారం..**



విజయవాడ, మార్చి 26, సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ఎన్నికల టైం దగ్గర పడుతు ఒడడంతో ప్రచారంలో దూకుడు పెంచుతున్నారు. ఈనెల 30న పిఠాపురం నుంచి సమర శంఖం పూరిస్తున్నారు. పిఠాపురం కేంద్రంగానే పవన్ కల్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. మూడు విడతలుగా పవన్ ప్రచారం ఉండేలా పర్యటన షెడ్యూల్ రూపొందిస్తున్నారు పార్టీ నేతలు. ప్రతి విడతలో జనసేన పోటీ చేసే నియోజకవర్గాలకు వెళ్లేలా షెడ్యూల్ రూపొందించనున్నారు. ప్రచారంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈనెల 30న పిఠాపురం వెళ్తారు. తొలిరోజు శక్తిపీఠమైన శ్రీ పురుహూతిక అమ్మవారిని పవన్ దర్శనం చేసుకోనున్నారు. అక్కడ వారాహి వాహనానికి పూజలు చేసిన అనంతరం దత్తపీఠాన్ని సందర్శిస్తారు. ఆ రోజు నుంచి మూడు రోజుల పాటు నియోజకవర్గంలోనే ఉంటారు. ఈ క్రమంలో పార్టీ నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తారు. క్రియాశీల కార్యకర్తలతో మండలాల వారీగా సమావేశాలు ఉంటాయని పవన్ రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ప్రకటనలో తెలిపారు. కూటమి భాగస్వాములైన టీడీపీ, బీజేపీ నేతలతోను పవన్ భేటీలకు ఏర్పాట్లు చేస్తున్నారని.. పిఠాపురం నుంచే రాష్ట్రంలోని ఇతర నియోజ కవర్గాలకు వెళ్లాలని పవన్ నిర్ణయం తీసుకోవడంతో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పిఠాపురం నియోజకవర్గంలో బంగారు పాప దర్గా సందర్శన, క్రైస్తవ పెద్దలతో సమావేశంతో పాటు సర్వమత ప్రార్థనల్లో పవన్ పాల్గొంటారు. ఉగాది వేడుకలను సైతం పవన్ పిఠాపురంలోనే నిర్వహించుకోనున్నారు.ఇదిలాఉంటే.. ఇప్పటికే 18 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో అభ్యర్థులను ప్రకటించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్.. పెండింగ్ స్థానాలపై కసరత్తు చేస్తున్నారు. మూడూ అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానంలో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అవనిగడ్డ, పాలకొండ, విశాఖ సౌత్ అసెంబ్లీ స్థానాలు, మచిలీపట్నం పార్లమెంట్ పై కొనసాగుతున్న సందిగ్ధత కొనసాగుతోంది. ఆయా ప్రాంతాల నేతలతో ఇప్పటికే భేటీ అయిన పవన్ కల్యాణ్.. పలుమార్లు చర్చలు నిర్వహించారు. ఇవాళ, రేపట్లో ఫైనల్ చేసి ఎన్నికల ప్రచారానికి పవన్ బయలుదేరనున్నారని తెలుస్తోంది.

# ఎన్నికల నియమావళిని ఉల్లంఘించితే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26-భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికలప్రవర్తనానియమావళిఉల్లంఘిం చకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుం టున్నామని జిల్లా కలెక్టర్‌డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు.మంగళవారం ఆయన ఛాంబర్ లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలప్రవర్తననియమావళిలో భాగం గాబహిరంగప్రదేశాల్లో గుర్తించిన 25,300 ఫోటోలు, పోస్టర్లు, ఫ్లెక్సీ బ్యానర్లనుతొలగించడంజరిగింద న్నారు. అలాగేఎన్నికలకోడ్ ఉల్లంఘనపై ప్రచురితమైన ప్రతికూలవార్తలకు బాధ్యులను చేస్తూ సంబంధిత 40 మంది అధికారులకు షోకాజ్ నోటీసులుజారీ చేశామన్నారు.రాజకీయ ప్రచారంలోపాల్గొన్న 12 మంది వాలంటీర్లను తొలగించడంతోపాటు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడ షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి వాహన అనుమతుల కోసం 123 దరఖాస్తులు వచ్చాయని అందులో 80 దరఖాస్తులకు వాహన అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు చేపట్టిన పనులు మాత్రం కొనసాగుతాయని కొత్త పనులు మాత్రం ఏవి మంజూరు చేయడం లేదన్నారు.సి విజిల్ ద్వారా 78 ఫిర్యాదులు అందాయని 100నిమిషాల్లోసంబంధిత ఫిర్యాదులనుపరిష్కరించడం జరిగిందన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా రాజకీయ పార్టీలు ప్రచారాన్ని కొనసాగిస్తే ఎంసిసి కింద చర్యలు తీసుకుంటామన్నారు జిల్లాలోని ఓప్రార్థన మందిరంలో రాజకీయ స్పీచ్ ఇచ్చినందులకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. త్రాగునీటి సమస్య తలెత్తిన 16 మండలాల్లో త్రాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు తక్షణచర్యలుతీసుకుంటున్నట్లుకలెక్టర్ తెలిపారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సమాచారం సేవల కోసంకలెక్టరేట్ లోజిల్లా స్థాయికమాండ్‌కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్‌నెంబర్ :1950(టోల్‌ఫ్రీ),కాల్‌సెంటర్ నెంబర్లు 08514-293905, 08514-293906సంప్రదించి ఎన్నికల సమాచా రంతో పాటు తమ ఓటు వివరాలను తెలుసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

# ఏపీలో మూడు పార్టీల కలయిక చారిత్రక అవసరం : బీజేపీ చీఫ్ పురందేశ్వరి



అమరావతి : ఏపీలో రామరాజ్యం రావాలంటే మూడు పార్టీల కలయిక చారిత్రక అవసరమని బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. మంగళవారం విజయవాడలో బీజేపీ పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి గెలుపుతోనే రామరాజ్యం వస్తుందని పేర్కొ న్నారు. వైసీపీ ప్రభుత్వంవిపరీతంగా అప్పులు చేసి ప్రజలపై భారం మోపారని, గ్రామ పంచాయతీ నిధులను సైతం దారి మళ్లించారని మండిపడ్డారు.ప్రభుత్వ భూములను తనఖా పెట్టారని విమర్శించారు. వైఎస్ జగన్‌ను గద్దె దించే లక్ష్యంగా కూటమికి ఒకటే ఎజెండా ఉందని స్పష్టం చేశారు. అవినీతి పాలన అంతమొందించాలి.. సుపరిపాలన రాష్ట్రంలో తీసుకురావాలన్న సంకల్పంతో మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. పార్లమెంట్, అసెంబ్లీ కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని సూచించారు.

# సంపాదకీయం

బుధవారం 27-03-2024

## సైబర్ నేరాల విలువ రూ.461 కోట్లపైనే

సైబర్ మోసాలపై అవేర్‌నెస్ ఎంత పెరుగుతున్నా మోసాల సంఖ్య మాత్రం తగ్గట్లేదని రిపోర్ట్‌లను బట్టి తెలుస్తోంది. దేశవ్యాప్తంగా మూడేళ్లలో సుమారు 12 వేల సైబర్ మోసాలు జరిగాయట. దాదాపు రూ. 461 కోట్ల డబ్బు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లింది. ముఖ్యంగా ఎలాంటి సైబర్ మోసాలు కామన్‌గా జరుగుతున్నాయంటే.. దేశంలో జరుగుతున్న సైబర్ మోసాల్లో క్రెడిట్ కార్డ్/ డెబిట్ కార్డ్‌ల ద్వారా జరుగుతున్న మోసాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే సరైన సెక్యూరిటీ, పాస్‌వర్డ్‌లు మెయింటెయిన్ చేయకపోవడం వల్ల ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు కూడా పెరుగుతున్నాయి. దీంతోపాటు మారుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఏఐ టూల్స్ ద్వారా కూడా పలు రకాల మోసాలు అమలుచేస్తున్నారు సైబర్ నేరగాళ్లురీసెంట్‌గా జరిగిన పలు సైబర్ నేరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా జరిగిన మోసాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంటర్నెట్ సెక్యూరిటీ సంస్థ మెకాఫీ నిర్వహించిన 'ది ఆర్టిఫిషియల్ ఇంపోస్టర్' సర్వేలో సుమారు 47 మంది భారతీయులు ఏఐ వాయిస్ స్కామ్‌లను ఎదుర్కొన్నట్లు తెలిసింది. వీరిలో చాలామంది రూ. 50,000 కంటే ఎక్కువ నష్టపోయారని రిపోర్ట్ ద్వారా తెలుస్తుంది. ఉచితాలు ఎలా వస్తాయని లేదా మనకెందుకు ఇస్తారని ఒక్క క్షణం ఆలోచిస్తే కష్టార్జితం మిగిలేది కదా. ఇలా ఇంటర్‌నెట్ వేదికగా ఎనో రకాల అక్రమాలకు అడ్డగా మారుతున్న సైబర్ మోసలు నగరాల నుంచి పల్లెల వరకు చేరాయి. ఇటీవల అనేక ఇంటర్‌నెట్ మోసాలు పల్లెల్లో కూడా బయటపడుతున్నాయి. పరువుపోతుందనే భయంతో బాధితులు బయటపడడంలేదు, ఫిర్యాదులు చెయ్యడం లేదు. దీని వల్ల మరి కొందరు మోసపోతున్నారు. ఇలా గత కొన్ని సంవత్సరాలుగా మోసాలు జరుగుతున్నా అవగాహన లేని వ్యక్తులు నష్టపోతూనే ఉన్నా రు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడి మా కంపెనీలో పెట్టుబడి పెట్టమని కోరడంతో కొందరు దురాశకు వెళ్లి అడిగిందే తడవుగా ఆ వ్యక్తి చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపించడం, మొదట కొంత లాభం రావడంతో నమ్మి, అప్పు తెచ్చి, మోసగాడు చెప్పిన అకౌంట్‌కు డబ్బులు పంపిస్తూ లాభం ఆశతో నష్టపోయి మోసగాడి బెదిరింపులకు భయపడి ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. హలో సార్ మా కంపెనీలో పెట్టుబడి పెట్టండి, మీ డబ్బులు రెట్టింపు అవుతాయి, మా లక్కీ డ్రాలో మీరు కోటి రూపాయలు గెలుచుకున్నారు. కానీ కొంచెం టాక్స్ కట్టాలి డబ్బులు పంపించండి. మీ లక్కీ ప్రైజ్ మనీని మీకు పంపిస్తాం ఛార్జీలు మీరు భరించాలి కొంత రుసుము పంపండి.. ఇలాంటి మాటలు నిజమని నమ్మి నేరగాళ్ల వలలో చిక్కి ఉన్నది పోగొట్టుకుని బంధువులకు, మిత్రులకు చెప్పలేక అప్పుల ఊబిలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అయినవారు కొందరైతే.. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారు మరి కొందరు. మీరు ఫలానా కంపెనీలో లక్కీ కస్టమర్ హైదరాబాద్ పట్టణంలో విల్లా గెలుసుకున్నారు 10% చెల్లిస్తే మా కంపెనీ ప్రతినిధి వచ్చి మీకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు అనగానే ఎగిరి గంతేసి ఛార్జీలు చెల్లించి చివరకు మోసపోయామని లబోదిబో అన్నవారు ఆలోచించాలి. డబ్బులు పంపించి ఆర్థికంగా నష్టపోయి, ఎంతో శ్రమించి సంపాదించిన ఆస్తిని సైతం పోగొట్టుకుని రోడ్డున పడ్డ కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థులే కాకుండా రాజకీయ నాయకులు కూడా సైబర్ మోసం నుండి తప్పించుకోలేకపోతున్నారు. తక్కువ రోజుల్లో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మి ఇన్వెస్ట్ చేసి మోసపోయిన సంఘటనలు. లక్కీ డ్రా వచ్చిందంటూ మెసేజ్ రావడంతో వాటిని నమ్మి కరీంనగర్, నిజామాబాదు, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లి మరో రూ. 50 వేల చొప్పున కట్టి ఆ కంపెనీ బోర్డు తిప్పడంతో భారీగా నష్టపోయిన సంఘటనలు కూడా అనేకం చోటు చేసుకున్నాయి. ఇంటర్‌నెట్ మోసాలకు అంతే లేకుండాపోయింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన సోషల్ నెట్‌వర్క్‌లో ఒకటి ఫేస్‌బుక్. సైబర్ నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా కూడా ఫేస్‌బుక్ నిలుస్తోంది. ఫేస్‌బుక్‌ను అడ్డం పెట్టుకుని చేసే నేరాలలో అకౌంట్లను హ్యాక్ చేయడం, డబ్బును డిమాండ్ చేయడం, వివరాలను దొంగిలించడం, భావోద్వేగాలతో ఆడుకోవడం, షాపింగ్ మోసం, ఫేక్ ఫ్రెండ్ రిక్వెస్ట్, అత్యవసరంగా డబ్బులు అవసరం అనే వాటితో మోసాలు వంటివిఎన్నో జరుగుతున్నాయి. సోషల్ నెట్‌వర్క్ ద్వారా భారీ సంఖ్యలో వ్యక్తులు కనెక్ట్ అయి ఉండడం గమనించిన సైబర్ నేరగాళ్లు అందినకాడికి దోచుకుందాం అనే రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్ హ్యాకింగ్, నకిలీ ప్రొఫైల్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి వివిధ కారణాలతో వేర్వేరు వ్యక్తులను సంప్రదించి, డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు. ప్రొఫైల్ యజమాని ఈ విషయాన్ని తెలుసుకొని, ఈ వార్తను అందరికీ తెలియజేసే వరకు అతని ప్రొఫైల్ హైజాక్ అయిందని తెలియదు. దీంతో ఫేస్‌బుక్ ఖాతాకు చెందిన తమ స్నేహితుడి నుండి రిక్వెస్ట్ వచ్చిందని మిగతావారు నమ్ముతారు. ఇది ఫేస్‌బుక్ చీటింగ్ స్కామ్ సంబంధించిన కేసు అని ఆలస్యంగా తెలుసుకుంటారు. ఇలా కొంత మంది డబ్బు పోగొట్టుకున్నవారు కూడా ఉన్నారు.

## సామాజిక సేవలోనే సంతృప్తి...





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 26 సమాజ హితం కోరుతూ సమాజానికి తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని డోన్ ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు, సేవా తత్పరులు బచ్చు చక్రి అన్నారు. మంగళవారం నాడు తన భార్య స్వర్గీయ బచ్చు జ్యోతి స్వరూప ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎండాకాలం ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం స్థానిక పాత బస్టాండ్ లో మినరల్ వాటర్ చలివేంద్రముని ప్రారంభించి అక్కడే స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో వేలాదిమందికి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం పేదలకు, అభాగ్యులకు అన్నదానం ఏర్పాటు చేయించి ఎంతోమంది ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సభ్యులు దాతకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ఎలక్ట్రికల్ ఆదినారాయణ, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు కోచ్చెర్వు శ్రీను, శేగు లోకేష్, సాగర్, గోంట్ల వాసు, స్ఫూర్తి సభ్యులు మధు, అంజి, నారాయణ స్వామి, మోహన్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## సుంకులమ్మ పూజ హాజరైన గౌతమ్...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి26ప్యాపిలిమండలం, వెంగళాంపల్లె గ్రామంలో టిడిపి నాయకులు వేంకటేష్ ఆహ్వానం మేరకు సుంకులమ్మ పూజ కార్యక్రమంకు హాజరైన యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి

## అందుకే వరుణ్ గాంధీని బీజేపీ పక్కన పెట్టింది.. ఆయన్ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నాం: అధిర్ రంజన్

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిభిత్ సిట్టింగ్ ఎంపీ వరుణ్ గాంధీకి బీజేపీ మొండిచెయ్యి చూపడంతో ఆయన నెక్స్ట్ స్టెప్ ఏంటనేది చర్చనీయాంశంగా మారింది.పార్టీ అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉంటారా? లేదా ఇతర పార్టీలో చేరి బీజేపీ రెబల్‌గా రంగంలోకి దిగుతారా అనేది ఆసక్తికరంగా మారింది.తాజాగా బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీకి కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చింది. ఆయన్ను తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వరుణ్ కుటుంబ మూలాలు 'గాంధీ'తో ముడిపడి ఉండటం వల్లే ఆయనకు బీజేపీ టికెట్ నిరాకరించిందని విమర్శించారు.వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని అధిర్ రంజన్ చౌదరి కోరారు. ఒకవేళ ఆయన పార్టీలో చేరితే సంతోషిస్తామన్నారు. వరుణ్ ఉ



న్నతమైన నాయకుడని, బాగా చదువుకున్న నేతగా అభివర్ణించారు. పారదర్శకత కలిగిన వ్యక్తిగా తెలిపారు. వరుణ్‌కు గాంధీ కుటుంబంతో సంబంధాలు ఉన్నాయని, అందుకే ఆయనకు బీజేపీ టికెట్ ఇవ్వలేదని చెప్పారు. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని తాము కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.కాగా పిలిభిత్ లోక్‌సభ స్థానం గత నాలుగు ఎన్నికల్లో బీజేపీ ఖాతాలోనే ఉంది. అయితే ప్రస్తుతం ఫిలిభిత్ నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న వరుణ్ గాంధీని కాదని జితిన్ ప్రసాద్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా వరుణ్ బీజేపీ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ తన గళం విప్పారు. సొంత పార్టీపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే పార్టీ ఆయనకు టికెట్ నిరాకరించినట్లు సమాచారం.

## కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయాలి.. ఢిల్లీలో బీజేపీ ఆందోళన..




దేశ రాజధాని ఢిల్లీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీల ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఆప్ శ్రేణులు గత మూడు రోజులుగా ఆందోళనలు చేస్తుంటే.. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయాలంటూ ఇవాళ బీజేపీ శ్రేణులు నిరసనకు దిగాయి.మూడు రోజులుగా ఆందోళనల్లో పాల్గొంటున్న ఆప్ నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ తర్వాత వదిలిపెడుతున్నారు. ఈ క్రమంలో ఇవాళ ఆంళోనలు షురూ చేసిన బీజేపీ నేతలను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వాళ్లలో ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర నచ్‌దేవ కూడా ఉన్నారు.కాగా, ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ను ఇటీవల ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. అరెస్టైనా సీఎం పదవికి రాజీనామా చేయకుండా ఈడీ కస్టడీ నుంచే సీఎంగా ఆదేశాలు ఇస్తున్నారు. దాంతో కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తున్నది.

## కాళ్లు పట్టుకుంటాం సారూ.. పంటలకు నీళ్లివ్వండి

పెద్దపల్లి : కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే కరెంట్ కోతలతో ఇబ్బంది పడు తున్న అన్నదాతలు నేడు పంటలకునీళ్లు లేక అరిగోస పడుతున్నారు. అప్పులు చేసి పంటలు వేస్తే కండ్లే ముందే ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రోడ్ల మీదికొచ్చి ఆందోళన చేస్తున్నారు.తాజాగా ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన రైతులు మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ధర్నా విరమింప చేయడానికి వచ్చిన సీఐ వెంకటేశ్వర్లు కాళ్లను పట్టుకొని సాగు నీరు ఇప్పించాలని రైతులు వేడుకున్నారు.



## సీనియర్ అడ్వకేట్ జీవీ ప్రసాద్ మాజీ వైసీపీలో చేరిక



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26-నంద్యాల పట్టణంలోని ప్రముఖ న్యాయవాది బలిజ కమ్యూనిటీకి చెందిన జీవీ ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు మంగళవారం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు. వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నంద్యాలను అభివృద్ధి చేయడంలో తన వంతుగా ఎంతో కృషి చేశారని వారు చేస్తున్న సేవ కార్యక్రమాల వల్లే నేడు మాజీ మంత్రి శిల్ప మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి డాక్టర్ రవి కృష్ణ అడ్వకేట్స్ కృష్ణారెడ్డి, శ్రీనివాసులు. రామసుబ్బయ్య. తిమ్మారెడ్డి, దండే శ్రీనివాసులు. పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి సహకరించండి

### అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26- పట్టణాభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోఇంటి పన్ను. ఖాళీ స్థలాల పన్నులను ఈనెల లోపు కట్టేవారికి వడ్డీ మాఫీ ఉంటుందని సూచించారు. 'మున్సిపల్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసుల ప్రబావంతో మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది పన్నుల వసూలు కోసం పరుగులు తీస్తున్నారని వారికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు . రెండు రోజులలో ఇంటి పన్ను 39 లక్షలు. నీటి పన్ను 6 లక్షలు వసూలు చేసారని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. ఆర్ ఓ వెంకట కృష్ణ తెలిపారు.

## సూపర్ 6 పథకాలను ప్రతి గడపగడపకు అందించడమే మా ధ్యేయం... - డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి వెల్లడి..



ఎమ్మిగనూరు మార్చి 26 విభారె న్యూస్...ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మిగనూరు పట్టణ కేంద్రంలోని 4 వ వార్డులో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ ద్వారా అందించే సూపర్ సిక్స్ పథకాలను ప్రతి గడప గడప తిరుగుతూ ప్రజలకు వివరించారు,ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా జగన్ రెడ్డి పాలనలో ఏ వర్గానికి చెందిన వారు కూడా సంతోషంగా లేరని, బాబు వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని ప్రతి ఒక్కరికి తెలియజేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రావాలంటే, ఇక్కడ సైకిల్ రావాలన్నారు. మన ప్రాంతానికి తాగునీరు, రావాలంటే తెలుగుదేశం గెలవాలన్నారు. బటన్ నొక్కుతున్న, బటన్ నొక్కుతున్న అంటూ ప్రజల పీకలు నొక్కాడు తప్పితే ప్రజలకు చేసింది ఏమీ లేదు. సిద్ధం సిద్ధమంటూ ఫ్లెక్సీలు వేసుకున్నాడు కానీ, అభివృద్ధి మాత్రం శూన్యం. మన త్రాగడానికి నీరు రావాలన్నా, మన పొలాలకు సాగునీరు కావాలన్నా, మన పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా తెలుగుదేశం ప్రభుత్వం, సైకిల్ రావాలన్నారు.


# గుంటూరులో కోటీశ్వరులే...

గుంటూరు, మార్చి 26 రాజకీయంగానూ, వాణిజ్య పరంగానూ ముందంజలో ఉండే గుంటూరు జిల్లాలో ఎన్నికలంటేనే కోట్లతో వ్యవహారం ముడిపడి ఉంటుంది. ప్రధాన పార్టీ నుంచి టిక్కెట్ దక్కాలే గానీ... కోట్లు ఖర్చుపెట్టేందుకు క్యూలో ఉంటారు. అలాంటిది వరుసగా టిక్కెట్లు దక్కించుకుని పోటీలో ఉన్న నేతల ఆస్తుల వివరాలు ఒకసారి చూసేద్దామా...గుంటూరు జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్న ఫలితం ఏదైనా ఉందంటే అది మంగళగిరి నియోజకవర్గం. ఎందుకంటే ఇక్కడి నుంచి తెలుగుదేశం అధినేత చంద్రబాబు తనయుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమిపాలైన ఆయన ఈసారి గెలుపై ధీమాగా ఉన్నారు. ఆర్థికంగా ఆయన్ను ఢీకొట్టే అభ్యర్థి జిల్లాలోనే లేదని చెప్పాలి. ఒకసారి లోకేశ్ ఆస్తులు వివరాలు చూద్దాం. మార్కెట్ విలువ ప్రకారం ఆయన ఆస్తులు 373 కోట్లు కాగా.... అప్పులు 10 కోట్లు వరకు ఉన్నాయి. వివిధ బ్యాంకుల్లో బాండ్ల రూపంలో మూడున్నర కోట్లు ఉండగా.... వివిధ కంపెనీల్లో ఉన్న షేర్ల విలువ 255 కోట్లుపైగానే ఉంది. పర్సనల్ లోన్ అడ్వాన్స్ మరో ఎనిమిదిన్నర కోట్లు తీసుకున్నారు. లోకేశ్ పేరిట ఫోర్డ్ ఫియిస్టా, రెండు పార్చునర్ కార్లు ఉన్నాయి. అలాగే బంగారం, వజ్రాభరణాల విలువ దాదాపు 2 కోట్ల రూపాయల వరకు ఉంది. మొత్తంగా ఆయన చరాస్తుల విలువ 271 కోట్లకు పైగానే ఉంది. హైదరాబాద్ మదీనాగూడలో 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా...దీని విలువ 47 కోట్లు పైమాటే. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, మాదాపూర్, మణికొండలో ఉన్న స్థలాల విలువ మరో 30 కోట్లు వరకు ఉంది. చెన్నైలో ఐదు కోట్ల విలువైన కమర్షియల్ బిల్డింగ్ ఉండగా..జూబ్లీహిల్స్‌లో 20 కోట్ల విలువైన ఇల్లు ఉంది. మొత్తం స్థిరాస్తుల విలువ 101 కోట్లు ఉన్నట్లు ఆయన 2019లో ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపారు. మొత్తం స్థిర, చరాస్తులు కలిపి లోకేశ్ ఆస్తి విలువ 373 కోట్లు ఉంది. అలాగే ఆయన వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు తొమ్మిదిన్నర కోట్లు వరకు ఉన్నాయి. తెలుగుదేశం సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకు ఏడున్నర కోట్ల ఆస్తి ఉండగా.... దాదాపు మూడుకోట్లు వరకు అప్పులు ఉన్నాయి. వివిధ బ్యాంకుల్లో ఉన్న క్యాష్, బాండ్లు, డిపాజిట్లు ,కార్లు, బంగారం విలువ కలిపి మొత్తం చరాస్తులు 3 కోట్ల 20 లక్షలకు పైమాటే ఉన్నాయి. గుంటూరు జిల్లాలో వివిధ చోట్ల ఉన్న వ్యవసాయ భూముల విలువ కోటిన్నర వరకు ఉండగా.. గుంటూరులో ఉన్న మూడు ఇల్లు విలువ మరో మూడు కోట్ల వరకు ఉంది. అలాగే వివిధ బ్యాంకుల నుంచి నరేంద్ర తీసుకున్న అప్పుల విలువ సైతం 2.78 కోట్లు వరకు ఉంది.మాజీమంత్రి నక్కా ఆనందబాబుకు కేవలం కోటీ 86 లక్షల విలువైన ఆస్తులు మాత్రమే ఉండగా... అప్పులు ఏమీ లేవు. మరో సీనియర్ మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు 42.5 కోట్ల ఆస్తులు ఉండగా... 25.34 కోట్ల అప్పు ఉంది. బ్యాంకులో క్యాష్, బాండ్లతో పాటు వివిధ సంస్థల్లో షేర్లు కలిపి మొత్తం చరాస్తులు విలువ దాదాపు 40 కోట్లు వరకు ఉంది. వివిధ చోట్ల ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర భూములు విలువ మొత్తం కలిపి మొత్తం మరో మూడుకోట్ల వరకు ఉంది. అలాగే ఆయన వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు 25.34 కోట్లు ఉంది. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటున్న మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణకు సైతం 40 కోట్ల విలువైన ఆస్తులు... రెండున్నర కోట్ల అప్పు ఉంది. వివిధ బ్యాంకుల్లో ఉన్న బాండ్లు, షేర్లు, అన్నీ కలిపి దాదాపు 3 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. 2 కోట్ల విలువైన వ్యవసాయ భూములు ఉండగా...20 కోట్ల విలువైన ప్లాట్లు ఉన్నాయి. గుంటూరులో ఉన్న ఇళ్ల విలువ మరో 15 కోట్లు ఉంది. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు 2.25 కోట్లు ఉంది.మరో కీలక నేత వినుకొండ మాజీఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆస్తుల విలువ దాదాపు 88 కోట్లు ఉంది. ఆయనకు ఆరుకోట్ల రూపాయల అప్పు ఉంది. బ్యాంకుల్లో బాండ్లు, వివిధ సంస్థల్లో షేర్లు అన్నీ కలిపి ఆయన చరాస్తులు 25 కోట్లు ఉండగా... పర్సనల్ లోన్లు మరో 17 కోట్లు తీసుకున్నారు. కోటిన్నర బంగారు ఆభరణాలు ఉండగా... మొత్తం చరాస్తుల విలువ 45 కోట్లు వరకు ఉంది. కోటిన్నర విలువైన వ్యవసాయ భూములు, 16 కోట్ల విలువైన ప్లాట్లతోపాటు హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లో 10 కోట్ల విలువైన కమర్షియల్ బిల్డింగ్‌లు ఉన్నాయి. హైదరాబాద్, వినుకొండలో మరో 15 కోట్ల విలువైన ఇల్లు ఉన్నాయి. మొత్తం స్థిరాస్తుల విలువ 42 కోట్లు ఉంది. అలాగే వివిధ బ్యాంకుల నుంచి ఆయన తీసుకున్న అప్పు ఆరుకోట్లు ఉందితెలుగుదేశం మరో సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావుకు రెండున్నర కోట్లు ఆస్తులు ఉండగా.. అనూహ్యంగా 50 కోట్లు అప్పు ఉంది. బ్యాంకు బ్యాలెన్స్, భూములు, ప్లాట్లు అన్నీ కలిపి రెండున్నర కోట్లు ఆస్తి ఉంది. గుంటూరు సిండికేట్ బ్యాంకులో ఆయన భార్యతో కలిపి తీసుకున్న అప్పు 49 కోట్లు ఉంది. మంత్రి విడదల రజనికి దాదాపు 130 కోట్ల విలువైన ఆస్తి ఉండగా... అప్పులేమీ లేవు. వివిధ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు ఐదుకోట్లు వరకు ఉండగా.. ఎల్ఐసీ ఇన్సరెన్స్ పాలసీలు మరో ఐదుకోట్లు ఉన్నాయి. మొత్తం ఆరున్నర కోట్ల చరాస్తులు ఉండగా... వ్యవసాయ భూములు, ప్లాట్లు, కార్లు ఏమీ ఆమె పేరిట లేవు. కోటిన్నర విలువ చేసే ఒక కమర్షియల్ బిల్డింగ్ ఉంది. అయితే అమెరికాలో ఆమె పేరిట ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థ విలువే 120 కోట్లు ఉంది. ఇండియాలో ఆమె పేరిట ఎలాంటి అప్పులు లేవు.మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత పేరిట రెండున్నర కోట్ల విలువైన ఆస్తులు ఉండగా... 27 లక్షల అప్పులు ఉన్నాయి.బ్యాంకులో డిపాజిట్లు, పర్సనల్ లోన్లు, బంగారు ఆభరణాలు కలిపి 73 లక్షల ఆస్తి ఉంది. మరో కోటిన్నర విలువైన ప్లాట్లు,ఇల్లు ఆమె పేరిట ఉన్నాయి.మంత్రి అంబటి రాంబాబు పేరిట 15 కోట్ల విలువైన ఆస్తులు, కోటీ 20 లక్షల విలువైన అప్పులు ఉన్నాయి. బ్యాంకులో డిపాజిట్లు, పర్సనల్ లోన్లు, కార్లు, బంగారు ఆభరణాలు అన్నీ కలిపి చరాస్తులు రెండుకోట్లు ఉండగా.... అవనిగడ్డ, సూరంపల్లిలో ఉన్న వ్యవసాయ భూముల విలువ దాదాపు 6 కోట్లు ఉంది. మరో కోటి రూపాయల విలువైన ప్లాట్లు ఉండగా... గుంటూరు, హైదరాబాద్‌లో కలిపి మరో ఆరుకోట్ల విలువైన కమర్షియల్ బిల్డింగ్‌లు ఉన్నాయి. ఇల్లుతో కలిపి మొత్తం స్థిరాస్తి విలువ 13 కోట్ల 20 లక్షలు ఉంది. వివిధ బ్యాంకుల నుంచి ఆయన తీసుకున్న అప్పు కోటీ 20 లక్షలు ఉంది.ఉపసభాపతి కోనరఘుపతి(కి 28 కోట్ల విలువైన ఆస్తులు ఉండగా... 83 లక్షల అప్పు ఉంది. బ్యాంకులో డిపాజిట్లు, బాండ్లు కలిపి రెండున్నర కోట్ల ఆస్తి ఉండగా... వ్యవసాయ భూమి ఏమీ లేదు. బాపట్లలో ఒక ప్లాట్ ఉంది. అలాగే హైదరాబాద్ ఉప్పల్‌లో రెండు కమర్షియల్ బిల్డింగ్‌లు, బాపట్లలో ఒక కమర్షియల్ బిల్డింగ్ ఉంది. వీటి విలువ దాదాపు 18 కోట్ల పైమాటే. హైదరాబాద్, బాపట్లలో ఉన్న ఇళ్ల విలువ మరో 7 కోట్ల వరకు ఉంది. మొత్తం స్థిర ఆస్తుల విలువ 25 కోట్ల 72 లక్షలు ఉంది. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు 83 లక్షలుగా ఉంది.గుంటూరు జిల్లాలో మరో కీలక నేత, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఆరున్నర కోట్ల ఆస్తులు ఉండగా... మూడున్నర కోట్ల అప్పు ఉంది. జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ పేరిట 11 కోట్ల ఆస్తులు ఉండగా... అప్పులు ఏమీ లేవు. బ్యాంకు డిపాజిట్లు, బాండ్లు, కార్లు అన్నీ కలిపి నాలుగున్నర కోట్ల ఆస్తులు ఉండగా... నాలుగు కోట్ల విలువైన వ్యవసాయ భూమి ఉంది.

## ఏం మాయ చేశారో కానీ...

తిరుపతి, మార్చి 26 ,తిరుపతి లోక్‌సభ స్థానాన్ని పార్టీలు మారి వచ్చిన వారికి టిక్కెట్ ఇవ్వడం ఇప్పుడు బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. మూడు పార్టీలు మారి బీజేపీలో చేరి టిక్కెట్ ను తెచ్చుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు ఏ మేరకు సహకరిస్తాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. తిరుపతి పార్లమెంటు సీటు మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాదరావుకు బీజేపీ సీటు కేటాయించింది. అయితే ఆయనకు ఏ విధంగా టిక్కెట్ ఇస్తారని పలువురు బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నా రు. నరసాపురంలో గెలిచే రఘురామ కృష్ణరాజుకు కాదని పార్టీ నేతకు టిక్కెట్ ఇచ్చినప్పుడు తిరుపతిలోనూ అదే ఫార్ములా ఎందుకు పనిచేయదని కమలం పార్టీలో కొందరు నిలదీస్తున్నారు. ఇంటి పేరునే బ్రాండ్ గా మార్చుకున్న లీడర్‌ను జనం ఆదరిస్తారా? ట్రాక్ రికార్డు మాత్రం... తిరుపతి పార్లమెంటు స్థానం ఎప్పుడూ కాంగ్రెస్ ఆ తర్వాత వైసీపీలదే. చివరిసారి 1999లో తిరుపతి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటస్వామి గెలుపొందారు. అదే ఆఖరు. ఆ తర్వాత జరిగిన 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ , వైసీపీలు మాత్రమే గెలిచాయి. 1984లో మాత్రం టీడీపీ విజయం సాధించింది. ఆ ఎన్నికల్లో చింతామోహన్ నుంచి గెలిచారు.

## సుజనాచౌదరికి పురందరేశ్వరి దెబ్బ




విజయవాడ, మార్చి 26, సుజనా చౌదరి పేరు ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు? ఆయనకు బిజెపి ఎంపీ టికెట్ ఎందుకు ప్రకటించలేదు? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఎన్నికల్లో సుజనా చౌదరి తప్పకుండా పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఒకానొక దశలో ఆయన విజయవాడ నుంచి పోటీ చేస్తారని కూడా టాక్ నడిచింది. విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని నాని వైసీపీ లోకి వెళ్లడంతో.. తప్పకుండా సుజనా చౌదరి బలమైన అభ్యర్థి అవుతారని అంతా భావించారు. ఆయన బిజెపి అభ్యర్థి అయితే చంద్రబాబు సైతం అభ్యంతరం చెప్పరని కూడా అనుకున్నారు. తరువాత గుంటూరు లోక్సభ స్థానం నుంచి సుజనా చౌదరి బరిలో దిగుతారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఇటువంటి తరుణంలో బిజెపి ఎంపీ అభ్యర్థుల జాబితాలో సుజనా చౌదరికి చోటు దక్కకపోవడం విశేషం.సుజనా చౌదరి సీనియర్ నాయకుడు. 2014 ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించారు.ఆ ఎన్నికల్లో పార్టీ సమన్వయంతో పాటు ఆర్థిక వ్యవహారాలు కూడా చూసుకున్నారు.2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.దీంతో సుజనా చౌదరికి ఎనలేని ప్రాధాన్యం పెరిగింది. పారిశ్రామికవేత్త, ఆపై కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. రాజ్యసభ సీటును కట్టబెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే టిడిపి ఎన్డీఏ నుంచి బయటకు రావడంతో కేంద్ర మంత్రి పదవి కోల్పోయారు. గత ఎన్నికల్లో టిడిపి ఓడిపోవడంతో బిజెపిలోకి చేరారు.అయితే గత నాలుగు సంవత్సరాలుగా సుజనా చౌదరి టిడిపి ప్రయోజనాల కోసం పోరాడుతున్నారని సొంత పార్టీలోనే ఒక విమర్శ ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత సుజనాతో పాటు ముగ్గురు రాజ్యసభ సభ్యులు టిడిపి నుంచి బిజెపిలో చేరారు. అందులో సీఎం రమేష్ ఒకరు. ఆయనకు ఈసారి అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారు. కానీ సుజనా చౌదరి కు మాత్రం ఎక్కడా టికెట్ ప్రకటించలేదు. కనీసం ఆయన పేరును పరిగణలోకి కూడా తీసుకోలేదు. దీంతో తెర వెనుక పురందేశ్వరి చక్రం తిప్పారని ప్రచారం జరుగుతోంది. సుజనా కు టికెట్ రాకుండా అడ్డుకున్నారని టాక్ నడుస్తోంది.టిడిపిలో ఉన్నప్పుడే ఎన్డీఏ ప్రభుత్వంలో సుజనా చౌదరి కేంద్ర మంత్రి అయ్యారు. అదే ఇప్పుడు ఎంపీగా ఎన్నికైతే కచ్చితంగా కేంద్రమంత్రి అవుతారని అంచనాలు ఉన్నాయి. మరోవైపు పురందేశ్వరి కేంద్రమంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారు. అందుకే ఆమె కచ్చితంగా గెలుస్తానని అనుకున్న రాజమండ్రి పార్లమెంట్ స్థానాన్ని ఎంచుకున్నారు. పొత్తులో భాగంగా సునాయాసంగా ఎంపీ కావచ్చు అని ఆమె భావించారు. అయితే సుజనా చౌదరి ఎంపీ అయితే తనకు అవకాశాలు సన్నగిల్లుతాయని పురందేశ్వరి భావించారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు కావడమే కారణం. అందుకే తెలివిగా పురందేశ్వరి సుజనా చౌదరి తప్పించారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఆయనకు విజయవాడ వెస్ట్ సిటీ ఇస్తారని కూడా తెలుస్తోంది. అంటే కూటమి అధికారంలోకి వస్తే సుజనా చౌదరి మంత్రి అవుతారన్నమాట. అయితే సుజనాకు కేంద్ర మంత్రి అంటేనే ఇష్టం. ఒక పారిశ్రామికవేత్తగా కేంద్రంలో ఉండాలని ఆయన చూస్తారు.

# ఏపీ కాపులు ఎటూ వైపు

కాకినాడ, మార్చి 26, ఏపీలో ఎన్నికల సమిపిస్తున్న కొలది ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కాపుల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. కాపు ఓట్లను తమ వైపు తిప్పుకుంటే గెలుపు ఖాయమని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కాపు ఫ్యాక్టర్ బలంగా వినిపిస్తోంది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంది. పవన్ కళ్యాణ్ వైపు కాపులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. గత ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ బరిలో నిలిచినా.. రకరకాల కారణాలతో కాపులు జగన్ వైపు ఆసక్తి చూపారు. వారిని తన వైపు తిప్పుకోవడంలో జగన్ కూడా సక్సెస్ అయ్యారు. ఇందుకు ముద్రగడ కూడా పరోక్షంగా కారణమయ్యారు. చంద్రబాబు పై ఉన్న కోపంతో ముద్రగడ కాపులను తెలుగుదేశం పార్టీ నుంచి దూరం చేశారు. కానీ పవన్ కళ్యాణ్ జనసేన వైపు వారిని మరల్చలేదు. జగన్ వైపు వెళ్లేలా తెర వెనుక ప్రోత్సాహం అందించారన్న అపవాదు ముద్రగడ పై ఉంది. ఇప్పుడు కూడా ముద్రగడ నేరుగా వైసీపీలో చేరి.. కాపులను ఆ పార్టీ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.2009 ఎన్నికల వరకు ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో ఉన్నారు. తెలుగుదేశం పార్టీలో ఎంపీ తో పాటు మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో సైతం వర్క్ చేశారు. ఆ సమయంలో కాపుల కోసం ప్రత్యేకంగా ఏ పని చేయలేకపోయారన్న అపవాదు ఉంది. 2009 ఎన్నికల్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి పిలిచి మరీ టిక్కెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ బరిలో ఉండడంతో.. కాపుల్లో బలమైన నాయకుడిగా ఉన్న ముద్రగడను పిఠాపురం నుంచి పోటీ చేయించారు. అక్కడ కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్నా.. వారు పెద్దగా ముద్రగడను ఆదరించలేదు. అక్కడ దారుణ ఓటమి ఎదురు కావడంతో ముద్రగడ మనస్థాపానికి గురయ్యారు. రాజకీయాలకు దూరమయ్యారు. అయితే తన రాజకీయ ఆధిపత్యానికి చంద్రబాబు గండి కొట్టారన్న కోపం మాత్రం ముద్రగడను వెంటాడింది. అన్నింటికీ మించి పిఠాపురంలో కాపు సామాజిక వర్గం తనను ఆదరించలేదన్న బాధ నివురు గప్పిన నిప్పులా మారింది.2014 ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత రిజర్వేషన్లు కల్పించడంలో జాప్యం చేశారు. దీంతో ముద్రగడ తెరపైకి వచ్చారు. కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని అందుకున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే కాపులకు రిజర్వేషన్లు ప్రకటించాలని కోరారు. అందుకు చంద్రబాబు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఉద్యమాన్ని ప్రారంభించారు. అయితే ఈ ఉద్యమంలో ముద్రగడ చిత్తశుద్ధి ఎంత ఉందో తెలియదు కానీ.. ఉద్యమం హింసకు దారి తీయడానికి అప్పటి విపక్షం వైసీపీ కారణమన్న ఆరోపణ ఉంది. అదే సమయంలో వైసీపీ కోసమే ముద్రగడ కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని తలపై ఎత్తుకున్నారన్న కామెంట్స్ కూడా ఉన్నాయి. ఉద్యమం పతాక స్థాయికి చేరడం.. తునిలో రైలు విధ్వంసం జరగడం.. వందలాదిమంది పై కేసులు నమోదు కావడం జరిగిపోయింది. ఈ మొత్తం పరిణామంతో రాజకీయ పరిస్థితులే మారిపోయాయి. చంద్రబాబుపై కాపుల ఆగ్రహానికి ఈ పరిణామాలన్నీ కారణమయ్యాయి. అయితే అప్పట్లో జనసేన ప్రత్యామ్నాయ పార్టీగా ఉన్నా.. కాపులు అటువైపు టర్న్ కాకుండా.. వైసీపీ వైపు వెళ్లేలా ముద్రగడ ప్లాన్ చేశారన్నది ఒక ఆరోపణ.2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి కాపులు దూరమయ్యారు. జనసేన వైపు వెళ్లకుండా వైసీపీ వైపు టర్న్ కావడంతో జగన్ అధికారంలోకి రాగలిగారు. కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని కోరుకున్న పద్మనాభం ఆ డిమాండ్ చేయాలి కదా? అలా చేయలేదు సరి కదా.. కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని ఉన్నఫలంగా నిలిపివేశారు. తనను శంకించినందుకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. అందరిలో అప్పటి వరకు ఉన్న అనుమానాలను నిజం చేసేలా ఉద్యమాన్ని నిలిపివేయడం విశేషం. అయితే నాడు ముద్రగడ ఉద్యమానికి తలంచి చంద్రబాబు ఇచ్చిన ఐదు శాతం ఈ బీసీ రిజర్వేషన్లను జగన్ నిలిపివేశారు. కాపులకు ఉద్దేశించి ప్రారంభించిన పథకాలకు సైతం మంగళం పలికారు. కానీ ఆ సమయంలో ముద్రగడ నోరు తెరవలేదు. పైగా సీఎం జగన్ కు అనుకూల ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఈ ఎన్నికల ముంగిట వైసీపీలో చేరిపోయారు. దీంతో ఇప్పటి వరకు ముద్రగడ పై ఉన్న అనుమానాలన్నీ నిజమని అభిప్రాయాలు బలపడేలా ఆయనే వ్యవహరించడం విశేషం.అయితే ఇప్పటివరకు కాపుల కోసం ముద్రగడ పద్మనాభం ఏం చేశారు అన్నది మాత్రం చెప్పడం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని చేయడం నిజం.ఆ ఉద్యమానికి స్పందించి చంద్రబాబు ఐదు శాతం ఈ బీసీ రిజర్వేషన్లు కల్పించడం వాస్తవం. అటు విదేశీ విద్యకు సంబంధించి కొన్ని రకాల పథకాలను సైతం అమలు చేశారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రిజర్వేషన్లను నిలిపివేశారు. కాపుల ప్రత్యేక పథకాలకు కోత విధించారు. అయినా ఎన్నడూ ముద్రగడ పద్మనాభం నోరు తెరవలేదు. కనీసం ఖండించలేదు. కానీ ఇప్పుడు వైసీపీలోకి అధికారికంగా చేరి పవన్ ను టార్గెట్ చేసుకుంటున్నారు. కాపు ఉద్యమానికి చంద్రబాబు కారకుడని ఆరోపిస్తున్నారు. నాడు విధ్వంశాలపై నోరు తెరవలేదని నిందలు వేస్తున్నారు. అయితే రాజకీయ ఉద్దేశంతోనే ముద్రగడ ఉద్యమాన్ని తలపెట్టారని ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ పవన్ స్పందించారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వ చర్యలను తప్పుపట్టారు. ఐదు శాతం ఈ బీసీ రిజర్వేషన్లు ప్రకటించడానికి పవన్ కారణం. ఆ రిజర్వేషన్లు ఎత్తివేసిన ముద్రగడ మాట్లాడకపోవడం కూడా కాపులకు శాపంగా మారింది. గత ఐదు సంవత్సరాలుగా కొన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు దక్కకుండా పోయాయి. ఇలా ఎలా చూసుకున్నా కాపుల కోసం ఉద్యమించిన ముద్రగడ పద్మనాభం.. ఏం సాధించలేదని తెలుస్తోంది. కేవలం ఇప్పుడు రాజకీయ కోణంలోనే ఆయన పవన్ పై ఆరోపణలు చేయడాన్ని కాపులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటువంటివి కాపు జాతికి సహేతుకం కాదని అభిప్రాయపడుతున్నారు. కాపులను అడ్డం పెట్టుకుని ఎన్నడూ పవన్ రాజకీయాలు చేయలేదు. ఆ మంచి గుణమే కాపులను ఆకట్టుకుంటుంది. గత ఎన్నికల్లో పవన్ ఉన్నా జగన్ వైపు అడుగులు వేసామన్న బాధ కాపుల్లో ఉంది.

## ఆంధ్ర రాములోరి కల్యాణానికి అంతా రెడీ

కడప, మార్చి 26 (న్యూస్ పల్స్) ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు విస్తృతంగా చేస్తున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఏప్రిల్ 17 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 22న సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశిల్ జిల్లా యంత్రాంగంతో సోమవారం ఒంటిమిట్టలో జేఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని సీతారాముల కల్యాణాన్ని(అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలన్నారు.ఏప్రిల్ 16వ తేదీన బ్రహ్మోత్సవాల అంకురార్పణ,



ఏప్రిల్ 17న శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని జేఈవో తెలిపారు. ఏప్రిల్ 20న హనుమంత వాహనం, ఏప్రిల్ 21న గరుడవాహనం, ఏప్రిల్ 22న సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23న రథోత్సవం, ఏప్రిల్ 25న చక్రస్నానం, ఏప్రిల్ 26న పుష్పయాగము నిర్వహించనున్నామని చెప్పారు.వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సీతారాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ, జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆ 68 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

విజయవాడ, మార్చి 26, ఏపీలో మరోసారి అధికారంలోకి రావాలని జగన్ భావిస్తున్నారు. వై నాట్ 175 అన్న నినాదంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అభ్యర్థులను మార్చారు. అటు విపక్షాలు కూటమి కట్టాయి. బలమైన అభ్యర్థులను బరిలో దించుతున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. రాయలసీమలో ఎట్టి పరిస్థితుల్లో పట్టు తగ్గకూడదని భావిస్తున్నారు. కోస్తా తో పాటు ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా 68 అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.గత ఎన్నికల్లో 151 స్థానాల్లో వైసీపీ గెలుపొందింది. ఏకపక్షంగా విజయం సాధించింది. తెలుగుదేశం పార్టీ 23స్థానాలకు పరిమితమైంది.జనసేన ఒకచోట విజయం సాధించింది. అంటే ఆ 24 స్థానాలతో పాటు పదివేల కంటే తక్కువ మెజారిటీ ఉన్న స్థానాలు 44 వరకు ఉన్నాయి. అటు విపక్షాలు గెలిచిన సీట్లతో పాటు తక్కువ మెజారిటీ దక్కిన స్థానాలను కలుపుకుంటే.. 68 అసెంబ్లీ సీట్లు అన్నమాట. అయితే ఈ 44 స్థానాల్లో 5000 కంటే తక్కువ మెజారిటీ సాధించిన స్థానాలు 12 ఉన్నాయి. మరో 32 కాపాడుకోకపోతే అధికారానికి దూరం కావడం ఖాయమని జగన్ ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే వాటిపైన ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.ముఖ్యంగా 5000 కంటే తక్కువ మెజారిటీ వచ్చిన 12 నియోజకవర్గాల్లో వైసిపి అపాయంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ నియోజకవర్గాలను ఒకసారి పరిశీలిస్తే.. విజయవాడ సెంట్రల్ 25, తిరుపతి 708, పొన్నూరు 1112, నెల్లూరు సిటీ 1988, తణుకు 2195, నగరి 2708, కొత్తపేట 4038,ఏలూరు 4072, ఎలమంచిలి 4146, తాడికొండ 4433, ప్రత్తిపాడు 4611, జగ్గయ్యపేట 4778 ఓట్ల మెజారిటీ మాత్రమే వైసీపీకి దక్కింది.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ..



శ్రీశైలం మార్చి 26 విభారె న్యూస్..చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున ( ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు) శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 26 న ఈ కుంభోత్సవం నిర్వహించబడు తుంది. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు,గుమ్మడికాయలు,నిమ్మకాయలు, మొదలగు నవి సమర్పించడం)ఈ కుంభోత్సవంజరిపించడం ఆనవాయితి. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది.ఇందులోభాగంగా మంగళవారం (26.04. 2024) అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాతఅమ్మవారికిఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

## శ్రీశైల దేవస్థాన అన్నప్రసాద వితరణ కు భక్తుల విరాళం...



శ్రీశైలం మార్చి 26 విభారె న్యూస్.. 26.03.2024 మంగళవారం శ్రీశైల దేవస్థాన శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం రూ.1,00,010 /-లను శ్రీమతి పత్తికొండ విజయలక్ష్మి , కర్నూలు వారు అందజేశారు.ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది.

## మానవ సేవ మాధవసేవ..



మంగళవారం మార్చి 26 విభారె న్యూస్.. తాలూకా అధ్యక్షులు రాహుల్ సాగర్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 39వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఎమ్మిగనూరు తాలూకా మెగా ఫ్యాన్స్ లేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మణ్ టాకీస్ సమీపంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షులు రాహుల్ సాగర్ మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడు రామ్ చరణ్ ని తండ్రి యొక్క సేవ స్ఫూర్తిని కొనసాగిస్తూ నేటితరం యువకులకు అభిమానులకు ఆదర్శంగా నిలిచిన నటుడు రామ్ చరణ్ ని తెలియజేశారు రాబోయే కాలంలో రామ్ చరణ్ మరెన్నో విజయాన్ని సాధించాలని ఆయన చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతం కావాలని కోరారు ఈ కార్యక్రమంలో రషీద్ రమేష్ పాల్గొన్నారు..

# వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకూడదు : జిల్లా కలెక్టర్ డా జి.సృజన



కర్నూలు, మార్చి 26, విభారే న్యూస్ – వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తాగు నీటి సమస్య రాకుండా చేపట్టాల్సిన చర్యలపై పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని వచ్చే రెండు మూడు నెలలకు సంబంధించి నీరు ఎంతవరకు అందుబాటులో ఉంది? తాగునీటి సమస్య పరిష్కారానికి ఏ విధంగా చర్యలు తీసుకోవాలి అనే అంశంపై ప్రతిపాదనలు రూపొందించాల న్నారు.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎల్ ఎల్ సి నుండి సి పి డబ్ల్యు ఎస్ పథకానికి సంబంధించి నీటిని డ్రా చేసుకొని 16 ఎస్ ఎస్ ట్యాంకులలో నీటిని స్టోరేజ్ చేసుకుంటున్నారా? ఒకవేళఎల్ఎల్సినుండి నీరు రాకపో యినా ఎస్ఎస్ ట్యాంకులలో స్టోర్ చేసుకున్న నీటిని ఎన్ని రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు అనే వివరాలను ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం ఎన్ని హ్యాబిటేషన్స్ ఉన్నాయి, అందులో జూన్ నెల చివరి వరకు ప్రతి రోజు నీటిని ఎన్ని హ్యాబిటేషన్స్ కి ఇవ్వగలం, రోజు మార్చి రోజు ఎన్ని హ్యాబిటేషన్స్ కి ఇవ్వగలం, ఏ సోర్సెస్ ద్వారా ఇవ్వాలనే విషయాలను ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్ అధికారులు సమన్వయం చేసుకొని రేపటి లోపు వివరాలను తనకు అందచేయాలన్నారు. మండలాలలో ఎన్ని బోర్లు ఉన్నాయి, అందులో ఎన్ని రిపేర్లు ఉన్నాయి, రిపేర్ ఉన్న వాటిలో రిపేర్ చేయిస్తే ఎన్ని పని చేస్తాయనే వివరాలను కూడా అందచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



మెయింటెనెన్స్ ఆఫ్ హ్యాండ్ పంప్స్ కి సంబంధించి 15 వ ఆర్థిక కమిషన్ గ్రాంట్ కింద చేయించాల్సి ఉంటుందని, ఇందులోఎంతఅమౌంట్ఉందిఅదిఎంతవరకు ఉపయోగపడు తుంది, అదనంగా ఎన్ని నిధులు, ఎప్పటినుండి అవసరం ఉంటుందో అనే విషయాలను కూడా తెలియచేయాలని జిల్లా పరిషత్ సీఈవో,డిపిఓ ను కలెక్టర్ ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, గాజులదిన్నె ప్రాజెక్ట్ లో ఉన్న నీటిని బ్యాలన్స్ చేసుకుంటూ ప్రతిరోజు నీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులలో మొదటి ప్రాధాన్యతగా ఏప్రిల్ మాసంలో కూలీలతోఅన్ని హ్యాబిటేషన్ ప్రాంతాలలో వర్షపు నీటిని స్టోర్ చేసేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, ఎపిఎస్పీడిసిఎల్ ఎస్ఈ ఉమాపతి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నుంచి వైసీపీ పార్టీ లోకి దూకుడు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26–. టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబి వైసీపీలో చేరిక టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, ఫరూక్, సీఎం బాష, అన్వర్ సోమవారం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో 24వ వార్డు వైఎస్సార్సీపీ ఇంచార్జి షేక్ రహంతుల్లా, సీనియర్ అడ్వకేట్ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు మునయ్య, రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వీరందరిని మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. పార్టీ భలోపేతానికి, విజయానికి కృషిచేయాలని కోరారు.మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులైన వారు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి విజయానికి శక్తిపంచనలేకుండా కృషిచేయాలని కోరారు.

# రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతులు మంజూరు చేస్తాం

**జిల్లా కలెక్టర్ మరియు ఎంసీఎంసి చైర్మన్ డా. కె.శ్రీనివాసులు**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26–భారత సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా కాకుండా ప్రజాస్వామ్యంలోఎన్నికల సమగ్రతను, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె.శ్రీనివాసులు పేర్కొన్నారు.మంగళవారం ఆయన ఛాంబర్ లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో మీడియా పోషించాల్సిన పాత్ర, ఫెయిడ్ న్యూస్, పత్రికలలో ప్రకటనలు, స్థానిక కేబుల్ ప్రసారాలలో రాజకీయ ప్రకటనలు తదితర అంశాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహనాకార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, ఎంసిఎంసి నోడల్ అధికారి సునీల్ కన్నా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ఎంసీఎంసీ చైర్మన్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో అత్యంత క్రియాశీలక పాత్రపోషించాలన్నారు. ఎన్నికలలో వివిధ విభాగాల లాగానే మీడియా కూడా ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషిస్తుందని. ప్రజలు పారదర్శ కంగా స్వేచ్ఛాయిత వాతావరణంలో ఓటు వేయ డానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రా నిక్ మీడియా సహకరించాలన్నారు. ఓ వ్యక్తిని పొగు డుతూ ఒకే వార్త ఒకేలా అన్ని పత్రికలలో ప్రచురితమైతే పెయిడ్ న్యూస్ కింద లెక్క కట్టి పోటీ చేసే అభ్యర్థి ఖాతా లో నమోదు చేస్తామన్నారు. అలాగే సంబంధిత పబ్లిషర్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమా వళిలో భాగంగా కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి కచ్చితంగాతీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షించి సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ రోజుకు 48 గంటల ముందు పత్రికల్లో ప్రచురించే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ఇప్పటినుండే ఎంసీఎంసీ ద్వారా అనుమతులు పొంది ప్రసారాలు చేయాల్సి ఉంటుందన్నారు.జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా, బల్క్ ఎస్ఎంఎస్లు,వాయిస్ మెసేజ్లు,సినిమాహాల్లో ప్రకట నలకు సంబంధించి ముందుగా ఎంసిఎంసి ద్వారా ధ్రువీకరణ అయిన తర్వాతనే తదుపరి చర్యలు గైకొనాలన్నారు.



## మరోసారి జగనన్న కే పట్టాభిషేకం...

**– వైసిపి ను గెలిపించండి..**

**– 34 వ వార్డు ప్రచారంలో బుట్టా ప్రతుల్..**



మంగళవారం ఎమ్మిగనూరు మార్చి 26 విభారె న్యూస్.. రాష్ట్రంలో జగనన్న కు పట్టాభిషేకం కట్టబెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైసిపి యూత్ నాయకులు బుట్టా ప్రతుల్ అన్నారు. మంగళవారం స్థానిక తేరు బజారు లోని మార్కండేయ స్వామి దేవాలయం దగ్గర నుంచి 34 వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటి కి వెళ్లి ప్రజలను కలుసుకొని వైసిపి ఓటు వేసి గెలిపించాలని కోరారు.వైసిపి అభ్యర్థి బుట్టా రేణుక ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. జగన్ ను ముఖ్యమంత్రి గా చేసుకుందాం అని అన్నారు. కార్యక్రమం లో కుర్ని కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారద, వైసిపి వార్డు ఇంఛార్జి లో విశ్వనాథ్ రమేష్,కోట కొండ నరసింహులు, కోరుశెట్టి విశ్వనాథ్,వడ్డే వీరేష్, బుట్టా రంగయ్య, మదు,శ్రీనివాసులు, బద్రీ,రఘువీర్,హర్ష పాల్గొన్నారు.

## వీరంపల్లి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బుట్టా రేణుక..



గోనెగండ్ల మార్చి 26 విభారె న్యూస్.. మంగళవారం రోజు గోనేగండ్ల మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలో శ్రీ బంగారులింగమయ్యస్వామిదేవరమహోత్సవనీలో ఎమ్మిగనూరుఎమ్మెల్యేఅభ్యర్థి శ్రీమతిబుట్టారేణుక,బుట్టా నీలకంఠం, బుట్టా ప్రతుల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కోడుమూరు ఇన్చార్జ్ కూడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి,గోనెగండ్ల మండలం యువ నాయకులు టి.కే.బందె నవాజ్, దొరబాబ,వీరంపల్లి గ్రామంసర్పంచ్సుంకన్న.ముఖ్య నాయకు లైన కృష్ణారెడ్డి, కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

## 35- పరిక్షా కేంద్రాల్లో తనిఖీలు : డీఈవో సుధాకర్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 26–నంద్యాల జిల్లాలో 134 పరీక్షా కేంద్రాలలో 27820 విద్యార్థులకు గాను 25716 విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారు. 2104 మంది విద్యార్థులు గైర్హాజరు కావడం జరిగిందని డీఈ వో సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు . జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్. స్టేట్ అబ్జర్వర్. డీఈ వో మంగళవారం తనిఖీలు చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190